# హరీష్‌రావు ఆధ్వర్యంలో ఉచిత కానిస్టేబుల్ శిక్షణ

## ఈనెల 23న అర్హత పరీక్ష



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజక వర్గం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి ఆధ్వర్యంలో కెసిఆర్ కోచింగ్ సెంటర్ ద్వారా ఉచిత కానిస్టేబుల్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే ఆన్ లైన్ ద్వారా అప్లికేషన్ స్వీక రించామని ఈ నెల 23 ఆదివారం రోజున శిక్షణ పొందెందుకు అర్హత పరీక్ష నిర్వహిస్తు న్నాట్లు నిర్వహకులు నరేష్ తెలిపారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతు సిద్దిపేట నిరుద్యోగ యువతి యువ కుల కోసం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు ఉచితంగా కానిస్టేబుల్ కోచింగ్ ఏర్పాటు చేసారని..ఈ నెల 19 తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు లు స్వీకరించామని చెప్పారు.. ఆన్ లైన్ దర ఖాస్తు చేసిన అభ్యర్థులు అందరూ ఈ నెల 23 తేదీ ఆదివారం రోజున అర్హత పరీ క్షకు హాజరు కావాల్సిందిగా వారు కోరారు.. ఆగస్టు 23వ తేదీన ఆదివారం రోజున బాబు జగ్జీవన్ రామ్ భవన్, లైబ్రరీ ఎదురుగా, సిద్దిపేటలోఉదయం 11నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. ఏవైన సందేహాలుంటే ఈఫోన్ నెంబర్‌ను 9030433459 సంప్రదించి సందేహా లను నివృత్తి చేసుకోవాలని కోరారు.


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 22 ఆగస్టు, 2026 | పేజీలు : 06


# కొత్త మండలాలు ఏర్పడితే

# కొత్తకొండను మండలం చేస్తాం

## రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** రాష్ట్రంలో కొత్త మండలాల ఏర్పాటు సమయంలో కొత్తకొండ మండలం ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్తకొండ మండలం ఏర్పాటైనప్పుడు ఎర్రబెల్లి గ్రామాన్ని అందులో చేర్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాల ఏర్పాటు ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గం వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజా పాలన ప్రభుత్వ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజా ప్రభుత్వంలో ఎర్రబెల్లి గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఎర్రబెల్లి గ్రామంలో పల్లె దవాఖాన ఏర్పాటు చేయాలని సర్పంచ్ శ్రవణ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఇందుకోసం తన తండ్రి జ్ఞాపకార్థం 3 గుంటల స్థలాన్ని విరాళంగా ఇస్తున్నట్లు సర్పంచ్ ప్రకటించారు.గ్రామంలో సంపు నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించారు.అంతర్గత రహదారుల నిర్మాణం, అంబేద్కర్ విగ్రహం నుంచి తండాకు వెళ్లే రహదారి పూర్తి చేయడం వంటి సమస్యలను సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే మంత్రి మంజూరు చేసిన రూ.10 లక్షలతో వీఓ భవనం నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించాలని మంత్రి సూచించారు.

**ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం**

గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును మరింత పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.జలసిరి పథకం కింద ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 వరకు సహాయం అందిస్తుందని తెలిపారు.అదేవిధంగా పంట పొలాల్లో ఫామ్

వివరాలు 2లో

# ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్‌ను కలిసిన కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని హరిత కాకతీయ వద్ద భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన సందర్భంగా హనుమకొండలోని హరిత కాకతీయకు భారత ఎన్నికల సంఘం కార్యదర్శి చేరుకోగా హనుమకొండ జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ ఎన్.రవి, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ , ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు. శుక్ర, శనివారాలు వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో క్లెయిమ్ లు, అభ్యంతరాలపై భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి బిఎల్వోలతో చర్చిస్తారు.భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో హనుమకొండ తహసిల్దార్/ ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఇతర అధికారులు ఉన్నారు



# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఈసిఐ కార్యదర్శి నవీన్ కుమార్

**ప్రజాపక్షం/వరంగల్:** జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర ఓటరు సర్వే ప్రక్రియను పరిశీలించేందుకు వచ్చిన భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ఓటరు సర్వే ప్రక్రియను, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ) నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ తదితర అంశాలపై బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లు పాల్గొని జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు చెందిన ఈఆర్ఓలు, ఏఈఆర్ ఓలతో సమగ్ర ఓటరు సర్వే నిర్వహణపై

వివరాలు 2లో




# కాళేశ్వరం బాలాలయంలో ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని బాలాలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సంధర్భంగా ముత్తైదువ మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు.వరలక్ష్మి వ్రతాలు ఆచరించేందుకు కాళేశ్వరం పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి మహిళా భక్తుల తాకిడి భారీగా పెరగడంతో బాలాలయం ప్రాంగణం సందడిగా మారింది.ఆలయ ఉప ప్రధాన అర్చకులు పనకంటి ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. తమ తమ కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,సర్వశుభాలు ప్రసాదించాలని వరలక్ష్మి అమ్మ వారిని వేడుకున్నారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చుకున్నారు. మహిళా భక్తులు ఆచరించిన సామూహిక వరలక్ష్మి వ్రతాలకు అవసరమైన పూజా సామాగ్రిని ఆలయ అధికారులు అందజేసారు.శ్రావణమాసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు ఆలయ ఈఓ మహేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి,ఆలయ ధర్మకర్తలు,ఆలయ సిబ్బంది,అర్చకులు,మహిళా భక్తులు పాల్గొన్నారు.



## ఎస్బిఐలో చిల్లర దందా

**ప్రజాపక్షం/పరకాల** : పరకాల మండలంలోని కామారెడ్డి పల్లి గ్రామంలో గల భారతీయ స్టేట్ బ్యాంకులో చిల్లర దందా నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో బ్యాంకులో పనిచేస్తున్న సిబ్బంది రైతుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించి రుణాలు పొందే సమయంలో బ్యాంకులో పనిచేస్తున్న ఓ అధికారి రైతుల వద్ద నుండి మాములు ఆశిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారి తనకి ఇష్టమైన వ్యక్తులను పక్కన కూర్చోబెట్టుకొని మిగతా వారిని బ్యాంకులోని రాని వ్వకుండా వెళ్ళమని దురుసుగా ప్రవర్తిస్తున్నారని అంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలిపినప్పటికీ స్పందన లేకపోవడంతో రైతులు ఆ అధికారి చే మోసానికి గురవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారి పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని లేదంటే ప్రజలు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగిఉండాలి

**ప్రజాపక్షం/వేలేరు:** సేంద్రీయ వ్యవసాయం అనగా రసానిక ఎరువులు,కృత్రిమ పురుగుమందులు వాడకుండా కేవలం పశువుల పేడ,కంపోస్ట్ పచ్చిరొట్ట వంటి సహజ సిద్ధమైన వనరులతో పంటలు పండించడం వలన నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పర్యావరణ సమతుల్యతను పెంపొందిస్తుంది,మరియు ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తుంది కనుక సేంద్రీయ వ్యవసాయంపై ప్రతిఒక్కరైతు అవగాహన కలిగి ఉండాలని లోడీసొసైటీ కోఆర్డినేటర్ సతీష్‌రెడ్డి అన్నారు.శుక్రవారం వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామపంచాయితీ కార్యాలయ సమీపంలో లోడీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి(పిఆర్ఎమ్‌హెచ్‌పి)ప్రాజెక్టుల్లో సంస్థ ఆదేశానుసారం గ్రామసర్పంచ్ కూరపాటి అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరై మాట్లాడారు.ఈసందర్భంగా సతీష్‌రెడ్డి, సర్పంచ్ అశోక్ తదితరులు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంతో మట్టిలోని సూక్ష్మ జీవులను,పోషకాలను కాపాడుకోవడం, పాటించాల్సిన పద్ధతులు పశువుల ఎరువులు గొర్రెలు, ఆవులపేడ, కలుపు నివారణ, పంటమార్పిడి ఒకేభూమిలో మళ్లీమళ్లీ ఒకే పంటవేయకుండా పలురకాల పంటలు సాగుచేయడంతో ప్రయోజనాలు కలుగడమేకాకుండా భూమి యొక్క నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతోంది. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కూరపాటి అశోక్, ఉపసర్పంచ్ ఎర్రగొల్ల రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయంను సందర్శించిన అధికారులు

**ప్రజాపక్షం/వెంకటాపూర్:** మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంపిహెచ్ఆర్డి అధికారులు శంకర్, నంద కిషోర్, రవి, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వినియోగదారులకు సేవలు అందించడంలో పురోగతి




**ప్రజాపక్షం/హనుమకొండ** : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు . శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొనగా, హన్మకొండ నక్కలగుట్టలో ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధ్యక్షతన డైరెక్టర్లు,చీఫ్ ఇంజనీర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు. టీజీఎన్పీడీసీఎల్లో వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వాట్సాప్ చాట్‌బాట్ మంచి స్పందన లభిస్తోందని సీఎండీ తెలిపారు. డిజిటల్ సేవలలో భాగంగా ఫిర్యాదుల పరిష్కారంలోనూ మెరుగైన పనితీరు ఉందని అన్నారు . అలాగే ఉద్యోగుల సేవలకు ఎంప్లాయ్ సపోర్ట్ బాట్ ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గతంలో ఉద్యోగి ఒక సమస్యను పరిష్కరించుకోవడానికి సంబంధిత విభాగానికి వ్యక్తిగతంగా వెళ్లి, సమస్యను పలుమార్లు వివరించి, పరిష్కారం కోసం సంప్రదించాల్సి వచ్చేదని,ఈ ఎంప్లాయ్ సపోర్ట్ బాట్ ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వ్యవస్థ పారదర్శకత, ట్రాకింగ్, బాధ్యతను పెంచుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్ , సి. ప్రభాకర్, సి.ఈలు: కె .తిరుమల్ రావు, అశోక్, కె. వెంకట రమణ, సురేందర్, గౌతమ్ రెడ్డి, సీజీయంలు చరణ్ దాస్, కిషన్, వేణు బాబు, జీయంలు ప్రభావతి, శ్రీనివాస్, కళాధర్ రెడ్డి , జయ రాజ్ , వెంకట కృష్ణ ,డి.ఈలు కె. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రామప్ప విద్యార్థులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హన్మకొండ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం హనుమకొండ లో నిర్వహించిన క్రీడా పోటీల్లో రామప్ప డిఫెన్స్ అండ్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.జావెలిన్ త్రో విభాగంలో కె. రిత్విక జిల్లా స్థాయి ప్రథమ స్థానం, బి. విష్ణుప్రియజిల్లా స్థాయి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.అదేవిధంగా ఎల్. జోష్న 600 మీటర్లు, 60 మీటర్ల రన్నింగ్ పోటీలలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి లౌడియా అభిషేక్ 100 మీటర్స్ మొదటి స్థానం, 200 మీటర్స్ తృతీయ స్థానం, 300 మీటర్స్ రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విజేతలను రామప్ప డిఫెన్స్ అండ్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఐలీ కర్ణాకర్ ఘనంగా సత్కరించి, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ప్రధాన కోచ్ కమల్ ను ప్రత్యేకంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ ప్రిన్సిపాల్ వినోద్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, జోనల్ మేనేజర్ పూర్ణచందర్,ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల విజయానికి కృషి చేసిన కోచ్‌లు, అధ్యాపకులను కూడా అభినందించారు.

## బోనస్ పొందడానికి వివరాలు నమోదు చేయండి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** మండలంలోని రైతులు ప్రభుత్వం సూచించిన 7 రకాల వరికి బోనస్ ప్రయోజనం పొందేందుకు ప్రభుత్వం సూచించిన విధంగా వరి సాగుకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగానమోదు చేసుకోవాలని గురువారం రైతులకుమండల వ్యవసాయ అధికారి ఏ.అనురాధ సూచించారు.డీలర్ వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేసిన /చేసే రైతులు సంబంధిత డీలర్ పాయింట్ వద్ద తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు. ప్రభుత్వం సూచించిన వరి రకాలైన బిపిటి 5204 (సాంబ మసూరి), డబ్ల్యూ జి ఎల్ 44 (సిద్ధి), కె ఎన్ ఎం 1638 (కునారం సన్నాలు), హెచ్ ఎంటి, జై శ్రీరామ్, కె ఎన్ ఎం7715, ఆర్ ఎన్ ఆర్ 15048 (తెలంగాణ సోనా) రకాలు నమోదు చేసుకోవాలన్నారు.సొంత విత్తనాలతో సాగు చేసే రైతులుపై పేర్కొన్న రకాలలో సొంత విత్తనాలతో వరి సాగు చేస్తున్న రైతులు బోనస్ కోసం స్వీయ ధ్రువీకరణ పత్రంను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు సమర్పించాలని, అనంతరం ఎఈఓద్వారా ఆ వివరాలనుధృవీకరించుకోవాలని తెలిపారు. వరి సాగుకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 10 లోపు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ కోరారు.

## బ్యాంకు ఖాతాదారుడు జీవిత బీమా తప్పక చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** నీరుకుల్ల యూనియన్ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఖాతాదారుడు తప్పకుండా ప్రధాన మంత్రి బీమా యోజన స్కీం ద్వారా జీవిత బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు. ఇటీవల మరణించిన వెన్నపురెడ్డి రాణి కుటుంబానికి జీవిత బీమా ద్వారా వచ్చినటువంటి రెండు లక్షల ఆర్థిక భీమా సహాయం శుక్రవారం రోజున అందజేయడం జరిగినది.. ఈ సందర్భంగా ఖాతాదారులతో బ్యాంకు మేనేజర్ ముని వర్మ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవిత బీమా యోజన ద్వారా సాధారణ మరణానికి 436 రూపాయలు, ఆక్సిడెంట్ మరణానికి 20 రూపాయల చొప్పున బ్యాంకులో ప్రధానమంత్రి జీవిత బీమా యోజన తీసుకుని మీ కుటుంబ భద్రతకు, ఆర్థిక భరోసా కు చేయూత మా బ్యాంకు ద్వారా పొందాలని ఖాతాదారులను కోరారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ సిబ్బంది నీలేష్, కృష్ణవేణి, సురేష్ రెడ్డి, కుమార స్వామి, బ్యాంకు మిత్ర కోటిలింగాచారి, లబ్ధిదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## కొత్త మండలాలు ఏర్పడితే కొత్తకొండను మండలం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

పాండ్ నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.1.30 లక్షల వరకు సహాయం అందిస్తుందని చెప్పారు.

**గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా నీరు**

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కాలువల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మంత్రి కోరారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.

**ఈ నెల 31 వరకు పెన్షన్ దరఖాస్తులకు అవకాశం**

అర్హులైన వారు కొత్త పెన్షన్ల కోసం ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ తదితర అర్హులైన వారికి సంబంధించిన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

**సోలార్ విద్యుత్‌తో అదనపు ఆదాయం**

పీఎం సోలార్ ఘర్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. అవసరానికి మించి ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని తెలిపారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రవణ్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఇసిఐ కార్యదర్శి నవీన్ కుమార్

మొదటి పేజీ తరువాయి

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో బిఎల్ఓలను నియమించి ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. జిల్లాలో 1,94,399 నో మ్యాపింగ్ అనామలీస్‌లో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసేందుకు అదనపు ఏఈఆర్ఓలను నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు జారీ చేసిన

నోటీసులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం స్వీకరించాలని సూచించారు. సమగ్ర ఓటరు సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, ఓటర్ల వివరాల పరిశీలన, ధ్రువీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించినా ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే జరిగిన తీరును పిపిటి ద్వారా భారత ఎన్నికల కమిషనర్ చైర్మెన్ నవీన్ కుమార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ తూర్పు నియోజక వర్గ ఈఆర్ఓ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, నర్సంపేట ఆర్డీవో, ఈఆర్ఓ ఆర్డీవో ఉమారాణి, వర్ధన్నపేట ఈఆర్ఓ, వరంగల్ ఆర్డీవో సుమ, డిఆర్వో విజయ లక్ష్మి , 13 మండలాల ఏఇఆర్ఓలు, తహసీల్దార్లు, ఎలక్షన్ సూపరిండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సికేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోశయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్(1), బీకాం హెచ్ ఆర్ ఆపరేషన్స్ (1) లలో ఖాళీగా ఉన్న పోస్టులకు గాను ఓసి, బిసి అభ్యర్థులు అయితే ఎం కామ్ పూర్తి చేసి 55 శాతం మార్కులతో, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు అయితే 50% మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.ఎంపికలో పి హెచ్ డి, నెట్, సెట్ అర్హత, బోధన అనుభవం కలిగిన వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా నేరుగా కాలేజీలో అందజేయాలని తెలిపారు.దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారికి సమాచారం అందించి ఎంపిక ప్రక్రియ చేపడతామని అన్నారు.పూర్తి వివరాల కోసం సికెఎం కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

## వయోవృద్ధులను గౌరవించాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కుటుంబాలకు పునాది పెద్దవారేనాని, వారిని గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ జే. జీవన్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ ఏజ్ హోమ్ లో వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంతో ఇబ్బందిపడుతున్న పెద్దవారిని ప్రధాన న్యాయమూర్తిగారు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో హోమ్ నిర్వాహకులు శ్యామ్ ప్రసాద్, శైలజ, సూపరింటెండెంట్ రఘురాం, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది అంబాల దేవేందర్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బాదం ప్రవీణ్

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా నూతన కలెక్టర్ కార్యాలయంలో ములుగు అదనపు కలెక్టర్(రెవెన్యూ, సివిల్ సప్లయి) మహేందర్‌ను ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ జికి పుష్పగుచ్చం అందజేసి ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ములుగు జిల్లా పరిపాలనలో అదనపు కలెక్టర్‌గా మహేందర్ జి అందిస్తున్న సేవలను బాదం ప్రవీణ్ అభినందిస్తూ, రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి కార్పొరేషన్ డివి స్ఓ ఫైసల్ హుస్సేన్, డిఎం కృష్ణవేణి నాయక్, తదితరులు పాల్గొని మహేందర్ జికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అనాథ పిల్లలకు బహుమతుల పంపిణీ

**ప్రజాపక్షం/ములుగు:** మున్సిపాలిటీ పాస్టర్స్ ఫెలోషిప్(ఎంపిఎస్) ములుగు ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్ అనాథ బాలబాలికలకు బహుమతులు, వితంతువులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సిస్టర్ జ్యోతి, సామాజిక సేవకురాలు, వర్ద్ సంస్థ ప్రతినిధి మాధవిలత అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిఎఫ్ ములుగు చైర్మన్ డాక్టర్ రోని ఓనేసిమస్ బాలబాలికలకు ఉత్తేరక తరగతి నిర్వహించి, విద్యతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సిటీ కోఆర్డినేటర్ బొచ్చు సమ్మయ్య చిన్నారులకు బహుమతులు అందజేశారు. అనాథలు, వితంతువులను ఆదుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎఫ్ ములుగు అధ్యక్షుడు పాస్టర్ సుదర్శన్, కార్యదర్శి బ్రదర్ ప్రేమ్‌కుమార్, ఈసి సభ్యుడు పాస్టర్ సిమోను, పాల్గొన్నారు.

## బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా రాజు

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షునిగా జఫర్‌గడ్ మండలంలోని ఉప్పుగల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు గడ్డం రాజు గౌడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంతోపాటు రైతుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతానని రాజు గౌడ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# తమ్ముడిని కొడవలితో కొట్టి హతమార్చిన అన్న



**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలం ముత్తారం కాలనీలో చోటుచేసుకున్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. తమ్ముడిని అన్నే హత్య చేసినట్లు దర్యాప్తులో శుక్రవారం వెల్లడించారు. వాజేడు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటాపురం సిఐ ముత్యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మద్యం మత్తులో తరచూ తనను వేధిస్తూ, కొడుతూ బాధించడంతో భరించలేక తమ్ముడిని హతమార్చినట్లు నిందితుడు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలో ముత్తారం కాలనీకి చెందిన జాడి రాంబాబు తన ఇంటి వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు వాజేడు ఎస్సై జక్కుల సతీష్ కు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు . వైద్యులు అందించిన పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా రాంబాబు మృతి హత్యగా నిర్ధారణ కావడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా అనుమానితులను విచారించగా మృతుడి అన్న జాడి జానకిరావుపై పోలీసులకు అనుమానం కలిగింది. ముత్తారం కాలనీకి చెందిన జానకిరావు వయస్సు 63 సంవత్సరాలు కాగా, కూలీగా పని చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు రాంబాబుతో కుటుంబపరమైన విషయాలపై తరచూ గొడవలు జరిగేవని, రాంబాబు మద్యం సేవించి వచ్చి తన ఇద్దరు భార్యలను కొట్టడంతో వారు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు. తనను తమ్ముడు పెడుతున్న వేధింపులు భరించలేక చివరకు రాంబాబును హతమార్చాలని జానకిరావు నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ రాత్రి రాంబాబు మద్యం మత్తులో ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో గడ్డి నరికే కొడవలితో అతడి తలపై కొట్టి హతమార్చినట్లు నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం రజిత వద్దకు వెళ్లిన జానకిరావు ప్రవీణ్‌ను పంపించాలని కోరినట్లు పోలీసులు తెలిపారు. అయితే తానే రాంబాబును హత్య చేసిన విషయాన్ని ఎవరికీ చెప్పకుండా దాచినట్లు విచారణలో నేరాన్ని అంగీకరించాడు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నిస్సార్ ఉన్నారు.

# ఉద్యమకారుల హక్కుల పరిరక్షణకు చర్చావేదిక



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం ,గుర్తింపు,హక్కుల పరిరక్షణకు ఈ నెల 23 న వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ చర్చావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడుదీపిక కిరణ్ వెల్లడించారు శుక్రవారం మండలకేంద్రంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు.తెలంగాణ సాధన ఉద్యమంలో కీలక పాత్రపోషించిన ఉద్యమకారుల అభిప్రాయాలు,సలహాలు సేకరించి ప్రభుత్వానికి ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నివేదిక రూపంలో అందించేదుకు చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రం ఏర్పడిన నాటినుండి ఉద్యమకారులకు గుర్తింపు లేదని అన్నారు.తెలంగాణ ఉద్యమంలో అమరులు,జైలుపాలైన వారికి సంక్షేమ ఫలాలు అందిస్తామని విస్మరించారని అన్నారు.ఉద్యమంలో భాగస్వాములైన ప్రజా సంఘాలు,వివిధ రాజకీయ పార్టీలు,సంస్థలు,కుల సంఘాల అభిప్రాయాలను సేకరించి ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అందించడమే చర్చావేదిక ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల గర్తిపు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, రాములు నాక్, శోభన్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంథని సంజీవ రావు ప్రత్యేక ఆహ్వానితులుగా హాసరౌతారని అన్నారు. ఈ ఆర్యక్రమంలో టిపిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాసి పార్వతి,రాష్ట్ర నాయకులు కామర గట్టయ్య,అయితే బాపు,బూడిద లావణ్య,దాసరి రమేష్ పాల్గొన్నారు.

# జనగామలో వైభవంగా వరలక్ష్మి వ్రతం



**ప్రజాపక్షం/జనగామ:** జనగామలో వరలక్ష్మి వ్రతం వైభవోపేతంగా జరిగింది. మహిళలతో దేవాలయాలు కిక్కిరిసిపోయాయి. జనగామలోని బాణాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం, పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న సంతోషి మాత దేవాలయాల్లో వరలక్ష్మి పూజలు జరిగాయి. హిందూ పండుగల్లో మహిళలు ఎక్కువగా ఇష్టపడే, ఆరాధించి లక్ష్మీదేవిని వరం కోరే పండుగ కావడంతో మహిళలు కొబ్బరి కాయలు, పూలు, పండ్లు, కొత్త చీరలు దేవుళ్లకు అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో వారికి వారికి ప్రత్యేక పూజలు చేసి వారు తెచ్చినవి దేవుళ్ల ముందు ఉంచి ఆరగించారు. బాణాపురం, సంతోషి మాత దేవాలయంలో మహిళలో కిక్కిరిసిపోయాయి. మహిళకు తోడుగా వారి కుటుంబీకులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలు, పండ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. మూరెడు పూలు వంద రూపాయలు విక్రయించగా డజన్ అరిటిపళ్లు వంద నుండి 150 రూపాయలకు విక్రయించారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన జఫర్‌గడ్ మండలానికి సంబంధించిన కొత్త డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం ముఖ్య అతిథిగా హాజరై డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు పని గట్టుకుని నాపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీ కొన్ని యూట్యూబ్ ఛానెల్స్‌ను కొని కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై సంబంధం లేని, సబ్జెక్ట్ లేని వార్తలతో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఏ ఎన్నికలు వచ్చినా నిజాయితీగా పనిచేసే వారినే ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన, మహిళల పక్షాన నిలబడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, స్థానిక సర్పంచ్ మోహన్‌రావు, తహశిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ దేవేందర్, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ అదాలత్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పోస్టల్ శాఖ హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22న పెన్షన్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందని పోస్టల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ గూగుల్ మీట్ ద్వారా జరిగే ఈ కార్యక్రమానికి తెలియజేయవచ్చు. ఫిర్యాదులను సెప్టెంబర్ 7లోపు సమర్పించాలని అధికారులు సూచించారు.

## శ్రీసోమేశ్వరాలయంలో వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చండికా అమ్మవారికి పంచామృత అభిషేకములు శ్రీసూక్త పూజా విధానం, విశేష నీరాజనములు, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు కుంకుమార్చన, పుష్పార్చనలు నిర్వహించి, ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, అనిల్, నాగరాజు, సిబ్బంది రమేష్, రాములు, భక్తులు పాల్గొన్నారు.

## రూపారెడ్డి హత్యను నిరసిస్తూ జనగామలో శాంతియుత ర్యాలీ

**ప్రజాపక్షం/జనగామ:** నల్లగొండ జిల్లా మల్లేపల్లి నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రూపారెడ్డి హత్యను నిరసిస్తూ శుక్రవారం జనగామలో టిఆర్ఎస్ఎంఎ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వయించారు. నెహ్రూ పార్కు నుండి చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పాఠశాల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. విద్యాసంస్థల నిర్వాహకులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత కల్పించాలని, గౌరవ ఇచ్చేలా చూడాలని కోసారు ఈ సందర్భంగా టిఆర్ఎస్ఎంఎ జనగామ జిల్లా అధ్యక్షులు పప్పు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులే ప్రిన్సిపాల్‌ను దారుణంగా హత్య చేయడం విచారకరమైందన్నారు. విద్యాసంస్థల్లో పని చేసే మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ఎంఎ కార్యదర్శి రాపాక విజయ్, కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఎన్ రామ్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గుడుంబా తయారీదారుల బైండోవర్

**ప్రజాపక్షం/మల్హర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అడువలపల్లి గ్రామానికి చెందిన గుడుంబా తయారీదారులను గుర్తించి వారిలో నలుగురి పై శుక్రవారం మండల తహసిల్దార్ రవి కుమార్ ముందు ఒక లక్ష రూపాయల గాను బైండ్ ఓవర్ చేసినట్లు కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరు మరల గుడుంబా తయారీ చేసినట్లయితే వీరి పై కేసు నమోదు తో పాటు లక్ష రూపాయల జరిమానా చట్టపరమైన కఠిన శిక్ష విధించబడుతుంది వారు అన్నారు. మండలంలో ఉన్న ప్రతి గ్రామంలోని గుడుంబా తయారీదారులందరినీ గుర్తించి మండల తహసిల్దార్ ముందు బైండోవర్ చేయడం జరుగుతుందని వారు అన్నారు.

## గ్రామ సమాఖ్య భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలంలోని బెగ్లూర్ గ్రామంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు సహకారంతో నిర్మించనున్న గ్రామ సమాఖ్య భవనానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్ భూమిపూజ చేసారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,గ్రామ సమాఖ్య భవనం ద్వారా మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు గ్రామాభివృద్ధికి కార్యక్రమాలకు కేంద్రంగా ఉంటుందని గ్రామ మహిళల వివిధ కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబిద్దారు దోమల రాజ్యలక్ష్మి సతీష్ ఇంటి ధర్వాజ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్, సర్పంచ్ ఆకుల రాజయ్య, ఉప సర్పంచ్ చల్లూరి సదానంద చారి, బుర్రి శివరాజ్, వివో అధ్యక్షురాలు దూలం మల్లక్క, వివో రాజమణి, నాయకులు చిప్పల జయంత్, రాజేష్, పంతంగి రాము,ఆకుల మొండయ్య, కారోబార్ మల్లేష్,కార్యదర్శి దామోదర్ పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య అమానుషం

**ప్రజాపక్షం/మరిపెడ:** యువత మత్తు పదార్థాలకు బానిసలై అఘయిత్యాలకు పల్పడుతున్నారనీ,ఆల్కాహాల్,గంజాయి,డగ్స్ వంటి మత్తు పదార్థాలపై కఠిన నియంత్రణ అవసరం అని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ అన్నారు.నల్గొండ జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు ప్రిన్సిపాల్ రూపారెడ్డి పైన దాడి చేసి,హత్య చేసిన ఘటనను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ అన్నారు. మత్తు పదార్థాలు యువత పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని,చిన్న వయసులోనే మత్తుకు బానిసలుగా మారి, ఆలోచనలు పెడదారి పట్టి,విపరీత ప్రవర్తనతో, చదువుతో పాటు కుటుంబ సంబంధాలు దెబ్బతినడం హింసత్మక దోరణి పెరిగి ప్రమాదకరంగా మారిందన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు విద్యార్థులకు, యువతకు అందకుండా పాఠశాలలు,కళాశాలల పరిసర ప్రాంతల వద్ద కఠిన నిఘా ఏర్పాటు చేయాలనీ, మత్తు పదార్థాల నెట్వర్క్ పైన పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలనీ కోరారు. ప్రిన్సిపాల్ రూపారెడ్డి కుటుంబానికి సిపిఐ పార్టీ తరుపున ప్రగడ సానుభూతి తెలియజేస్తు, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలనీ కోరారు.

## నెక్కొండ సిఐగా ఫణిందర్

ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కె ఫణిందర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సిఐగా విధులు నిర్వహించిన సన్నాయిల శ్రీనివాస్ బదిలీపై వెళ్ళడంతో ఆయన స్థానంలో ఫణిందర్‌ను నియమించారు. ఈ మేరకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వుల అనంతరం ఫణిందర్ నెక్కొండ సర్కిల్ బాధ్యతలు చేపట్టారు. నెక్కొండ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడం తన ప్రాధాన్యతలుగా కొత్త సిఐ పేర్కొన్నట్లు సమాచారం. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సర్కిల్ పోలీస్ సిబ్బంది ఫణిందర్‌కు అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా, నెక్కొండ సీఐగా పనిచేసిన శ్రీనివాస్‌ను బదిలీ చేసినట్లు తాజా వెల్లడించింది.

## ఘనంగా ఎర్రబెల్లి స్వర్ణ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ లక్ష్మి ఆమె నివాసంలో స్వర్ణను ప్రత్యేకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్స్ తినిపించి శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో స్వర్ణ మరిన్ని ఉన్నతభాగస్వాములని తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక పదవులు అధిరోహించాలని, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని సోమ లక్ష్మి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సోమ లక్ష్మి మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ బలోపేతానికి స్వర్ణ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గిరిగిరి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/గూడూరు:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని రాజ్యసభ సభ్యులు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సూచించారు.కేసముద్రం నెల్లికుదురు ఇనుగుర్తి మండలాల నూతన అధ్యక్షులు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఏడెళ్ల యాదవరెడ్డి బైరు అశోక్‌గౌడ్‌లు శుక్రవారం వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలకు తావులేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కోరారు.అనంతరం నూతన మండల అధ్యక్షులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.పార్టీ బలోపేతమే లక్ష్యం అని సమ్మయ్యగౌడ్ అన్నారు. కేసముద్రం మండల అధ్యక్షుడు చిరువేరు సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మరో పది రోజుల్లో గ్రామ కమిటిల ఏర్పాటు చేపడుతామని పాత అధ్యక్షులు కార్యదర్శులు సహకరించాలని కోరారు. కాబోమే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా పనిచేస్తామని తెలిపారు.

# నర్సంపేట టి హబ్‌ను తనిఖీ చేసి డిఎంహెచ్ఓ

### ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సమీక్ష



**ప్రజాపక్షం/ నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని తెలంగాణ డయోగ్నోస్టిక్ హబ్ సెంటర్‌ను శుక్రవారం వరంగల్ జిల్లా వైద్యాధికారి రాజారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు, సేకరించిన నమూనాలు, నమూనాల సేకరణ సమయం, సేకరించిన నమూనాలు టిహబ్‌కు చేరుతున్న సమయం తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షా నమూనాల సేకరణ, రవాణా ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల సేవలు చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. తదుపరి నర్సంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ 2011, సంబంధిత రూల్స్2022 అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ తప్పనిసరిగా చట్టం, నిబంధనలను పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వాటికి సంబంధించిన టారిఫ్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించే బోర్డులను రిసెప్షన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ, నర్సంపేట డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ఎస్ఓ ప్రసన్న కుమార్, ఎల్‌డి కంప్యూటర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ఐఎంఎ సభ్యులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9న ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశం



**ప్రజాపక్షం/గూడూరు:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరగనున్న నూతన మండల కమిటీల జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ గూడూరు మండల ఇంచార్జ్ కొమ్ము నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన గ్రామ కమిటిలతో పాటు మండల కమిటిని పూర్తి చేసి సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నూతన తరాన్ని ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో సైన్యంలా తయారు చేస్తూ భవిష్యత్‌లో మందకృష్ణ మాదిగ తీసుకునే నిర్ణయాలకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈసందర్భంగా గూడూరు మండల గాజులగట్టు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాష్మాల విజయకాంత్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా భాష్మాల రవీందర్ మాదిగ ఉపాధ్యక్షుడిగా దాసరి ప్రశాంత్ మాదిగ అధికార ప్రతినిధిగా భాష్మాల ముఖేష్ మాదిగ కోశాధికారిగా పాల్వాయి సాయిబాబు మాదిగ గౌరవ సలహాదారుగా భాష్మాల అంబరీష్ మాదిగ ఎర్రబెల్లి అశోక్ మాదిగ ఉన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగస్తుల సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట పిలుపుతో మహబూబాబాద్ లో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి.. హామీల పేరుతో తెలంగాణను డిస్ట్రక్షన్ చేశారని, రెగ్యులర్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం నెలల తరబడి జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగస్తులు ప్రభుత్వానికి ఊపిరిగా చేయడానికి లేరు.. రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములని తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, నేడు తమ హక్కుల కోసం ఉద్యోగులే రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శలు చేశారుసీపీఎస్ రద్దు చేసి ఓపి ఎస్ అమలు చేయాలని, 317 జీవోను సవరించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలని అయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతాల నుంచి ఇ హెచ్ ఎస్ పేరుతో కోతలు వేస్తున్నప్పుడు.. వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే అని గుర్తుచేశారు.మాజీ ఎంపిక మాలోత్ కవిత మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగులు ఉద్యమకారులని, ఉద్యమంలో సైతం వారి పాత్ర ఉందని ఉద్యోగులకు దేశంలోనే అత్యధిక పిఆర్సీ 43% ఇచ్చి గుండెల్లో పెట్టుకొని చూసుకున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని, రాళ్ళ సాక్షిగా ప్రారంభం అయిన ఏ ఉద్యమం వెనకడుగు వేయలేదని, బీఆర్ఎస్ పార్టీ కేటీఆర్ సూచనల మెరకు తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి ఉద్యోగుల హక్కులు సాధిస్తామన్నారు.. ఫ్యూచర్ సిటీ మీద, మూసి ప్రక్షాళన మీద ఉన్న శ్రద్ధ, హైడ్రా కూల్చివేతల మీద ఉన్న శ్రద్ధ పాలన మీద, ప్రజల మీద, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పట్ల లేదని ధ్వజమెత్తారు. విద్యార్థుల మీద పోలీసులు దాడి చేయడం మంచిది కాదని,తక్షణమే జీవో 97 రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యుగుల సంఘం జిల్లా అధ్యక్షులు, ఈశ్వర్ కుమార్, తెలంగాణ పెన్షన్స్ అసోసియేషన్ రూపిరెడ్డి వెంకట్ రెడ్డి, బద్రి నారాయణ , జరిపోతుల వెంకన్న, ఎండి ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల క్రమశిక్షణే విజయానికి తొలి మెట్టు: సిఐ ఎల్ పవన్ కుమార్

**ప్రజాపక్షం/మరిపెడ:** చదువుకుంటున్నా ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగితే విజయం సాధించడం పెద్ద విషయం కాదనీ,(క్రమశిక్షణే విజయానికి తోలి మెట్టు అని మరిపెడ సిఐ ఎల్ పవన్ కుమార్ అన్నారు.శుక్రవారం మరిపెడ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల జూనియర్ కళశాలను సందర్శించి విద్యార్థులకు సైబర్ క్రైమ్,రోడ్డు ప్రమదాలు,మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.పిల్లలలో నైతిక ప్రవర్తన గురించి తెలుపుతు,ఇటీవల చోటుచేసుకున్నా ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య, బాలిక తాత హత్య విషయం వంటి సంఘటనలు ఉదాహరిస్తు,నేరం చేయుటకు కారణాలు తెలుపుతూ, నేర ప్రవృత్తి జోలికి ఉండని విద్యార్థులను మోటివేషన్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంమోహన్,వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, పిఇటి బాలు, మహేంద్ర, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## పిఆర్‌టియుటి ఎస్ మహబూబాబాద్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** పిఆర్‌టియుటి ఎస్ మహబూబాద్ మండల నూతన కార్యవర్గ శుక్రవారం ఎన్నుకున్నారు. ఉత్కంఠభరితంగా జరిగినీ ఎన్నికలల్లో మండల అధ్యక్షురాలుగా కాపరబోయిన సుజాత, మండల ప్రధాన కార్యదర్శిగా కొప్పుల నాగరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాపోలు యాకయ్య గారు, ఎన్నికల అధికారులుగా జి శ్రీధర్, వి.సీతారాములు, జనార్దన్ రెడ్డి, ప్రభుదాస్ యుగంధర్ రెడ్డి, భాస్కర్లు ఎన్నికలు నిర్వహించారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో సుజాత, నాగరాజు గార్లతో పాటు వారి నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మిర్యాల సతీష్ రెడ్డి చాగర్లమూడి శ్రీధర్ గార్లు, జాతీయ ఉపాధ్యక్షులు నూకల గీతారెడ్డి గారు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుగులోతు హల్యా నాయక్, వెంకట్ రెడ్డి కనకయ్య లక్ష్మారెడ్డి, శ్రీధర్ వెంకన్న వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశా

## పండగలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నగరంలో మిలాద్..ఉన్..నబీ, వినాయక చవితి నిమజ్జనం తదితర పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, హార్టికల్చర్ తదితర విభాగాల అధికారులతో పండగల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26న మిలాద్..ఉన్..నబీ సందర్భంగా ప్రధాన రహదారులు, ప్రార్థనాల స్థలాల పరిసరాల్లో పారిశుధ్యం, లైటింగ్, రహదారుల మరమ్మతు పనులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వినాయక నిమజ్జనం కోసం హనుమకొండ పరిధిలో 19, వరంగల్ పరిధిలో 18 ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, సిహెచ్ ఎంఓ డాక్టర్ రాజారెడ్డి, సిహెచ్ఓ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ కొలువుల సాధనకు ఉచిత శిక్షణ అందించాలి

**ప్రజాపక్షం / నర్సంపేట :** పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తరపున ఉచిత శిక్షణ, భోజన వసతి కల్పించాలని నర్సంపేట మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ భూస శిరీషరాజు అన్నారు. ప్రైవేట్ శిక్షణ సంస్థల ఫీజులను భరించే స్తోమత లేని గ్రామీణ యువతకు నాణ్యమైన స్టడీ మెటీరియల్‌తో పాటు భోజన వసతి కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి సొంత నిధులతో రెండు విడతల్లో దాదాపు 800 మందికి 45 రోజుల పాటు ఉచిత కోచింగ్, భోజనం, స్టడీ మెటీరియల్ అందించారని, దాని ద్వారా 140 మంది యువత ప్రభుత్వ పోలీస్ ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. అదే విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కూడా ప్రత్యేక చొరవ చూపి, నియోజకవర్గ యువత బంగారు భవిష్యత్తు కోసం వెంటనే ఉచిత కోచింగ్ సహకరించాలని ఆమె కోరారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ప్రసూతి విభాగం, ఐసీయూ, రక్త పరీక్షల ల్యాబ్‌లను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, ఆసుపత్రిలోని సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలకు వచ్చే ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రంగా ఉందని అభినందించారు. మాతా శిశు సంరక్షణ సేవలు, ప్రసవాల సంఖ్య పెరుగుతుండటం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ



రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రోగుల నమూనాలను టీహబ్‌కు పంపించి పరీక్షల నివేదికలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు. పాము, తేలు వంటి విష జంతువుల మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రుల సమన్వయ అధికారి డా శ్రీకాంత్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ వసంత రావు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**భూ భారతి, సాదా బైనా**
**బల్క్ ల్యాండ్ సర్వేలో వేగం పెంచాలి**

భూ భారతి, సాదా బైనామా, బల్క్ ల్యాండ్ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బల్క్ భూముల సర్వే, భూ భారతి, సాదా బైనామా, సర్ ప్రక్రియకు నోటీసులు జారీ తదితర అంశాలపై తహసీల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామాలో 2325, భూ భారతి 93 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కానీ ఓటర్లు, అనామలిస్ ఓటరులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. జారీ చేసిన నోటీసు, నోటీసు తీసుకున్న వ్యక్తి ఫోటోలు ఎన్నికల సంగం పోర్టల్ అప్ లోడ్ చేయాలని సూచించారు.

## ఆసుపత్రులను తనీఖీ చేసిన కేంద్ర కమిటీ

**ప్రజాపక్షం/ వెంకటాపురం (నూగురు):** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏదిరా, సిహెచ్‌సివెంకటాపురం మలేరియా నివారణ నియంత్రణ కార్యక్రమాలు అమలు తీరును మలేరియా సెంట్రల్ టీం ప్రతినిధి లక్ష్మణ్ బృందం పరిశీలించింది. శుక్రవారం వెంకటాపురం సిహెచ్‌సి వైద్యాధికారి యుధిస్టర్ గౌడ్ గారితో సమావేశం అనంతరం ల్యాబ్ పరిశీలించడమ ల్యాబ్ టెక్నీషియన్ గణేష్‌తో కలసి వ్యాదిగ్రస్తుల పరీక్షలు గురించి రికార్డును పరిశీలించడం జరిగింది. గ్రామీణ ప్రాంతంలో మలేరియా అనుమానిత కేసులను సకాలంలో గుర్తించి రక్తపరీక్ష చేయడం,పాజిటివ్ కేసులను గుర్తించి తక్షణ చికిత్స అందించడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే మలేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు నివారణ చర్యలు పరిసరాల పరిశుభ్రత, దోమతెరల వినియోగం, జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్యకేంద్రం వెళ్ళాలని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సెంట్రల్ టీం ప్రతినిధి లక్ష్మణ్, ఆశోక్, సురేష్ , సిహెచ్‌సి వైద్యాధికారి యుధిస్టర్ గౌడ్, ఎస్‌యుఒ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్‌షాపులు ఎత్తేయాలని ఏకగ్రీవ తీర్మానం

**ప్రజాపక్షం – జనగామ రూరల్ :** జనగామ మండలంలోని గానుగుపహాడ్ గ్రామంలో బెల్ట్ షాపులు ఎత్తేసి అక్రమ మద్యం అమ్మకాలు నిలిపివేయాలని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మాణం చేశారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు గ్రామ ప్రజలు మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో తీర్మాణం చేసినట్లు గ్రామ సర్పంచ్ సానబోయిన అనూష తెలిపారు. ఆరోగ్యవంతమైన కుటంబాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామాల అభివృద్ధికి ఆరోగ్య వంతమైన సమాజమే లక్ష్యమంటు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కుటుంబం సంక్షేమ, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించిన గ్రామ ఉప సర్పంచ్ కొర్ర శంకర్, వార్డు సభ్యులు పొలాల రాజు, కొర్ర కాలురామ్, రెడ్డబోయిన బాల స్వామి, మారబోయిన కమలాకర్, కూకట్ల నరేష్, గడిగే జంపన్నలతో పాటు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రత దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి మున్సిపాలిటి పరిధిలోని మంజూరునగర్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వారి సతీమణి గండ్ర జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొని, వారి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మంజూరునగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమానికి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి,అమ్మవారి ఆశీస్సులతో భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదే విదంగా వచ్చే నెల అనగా సెప్టెంబర్ 4 నుండి 7వ వరకు జరిగే ఆలయ వార్షికోత్సవ, పవిత్రోత్సవ కార్యక్రమాలల్లో కూడా పాల్గొన్ని, ఆ స్వామి వారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.



రాంనగర్ లో వరలక్ష్మీ వ్రతం లో ప్రత్యేక పూజలు చేసిన మహిళలు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సుభాష్ కాలనీ, రాంనగర్ లో మహిళలు అందరు కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం చేయడం జరిగింది. శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని వరలక్ష్మి వ్రతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భార్య భర్తల సుఖ సంతోషంగా ఉండాలని అలాగే కుటుంబాలు పిల్లాపాపలతో చల్లగా ఉండాలని ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు కలగాలని వారు లక్ష్మీదేవిని కోరుకున్నారు.

# పోషకాహారంతో క్షయ నిర్మూలన



**ప్రజాపక్షం/ములుగు:** క్షయ వ్యాధి నిర్మూలనలో పోషకాహారం కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా టిబి నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ రవితేజ అన్నారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులందరికి న్యూట్రిషన్ కిట్లు, డైరెక్ట్ బెనిఫిషరీ స్కీం కింద నెలకు రూ.1000 చొప్పున సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ములుగు జిజిహెచ్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రేడియాలజీ భవనంలో క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్లలో నూనె, ప్రొటీన్ ఫౌడర్, గుడ్లు, పప్పు తదితర పోషకాహార పదార్థాలు ఉంటాయని తెలిపారు. వాటిని క్షయ రోగులకు సక్రమంగా అందించాలని సూచించారు. క్షయ కేసులను గుర్తించేందుకు నిర్ధిష్ట ప్రణాళికతో స్క్రీనింగ్ నిర్వహించాలని చెప్పారు. రోగుల కుటుంబ సభ్యులకు ప్రివెంటివ్ ట్రీట్‌మెంట్ అందించడం ద్వారా క్షయ వ్యాధి వ్యాప్తిని 90 శాతం వరకు నివారించవచ్చన్నారు. మందులు అందించడంతో పాటు కాంటాక్ట్ ట్రేసింగ్, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సిబ్బంది నిబద్ధతతో పనిచేసినప్పుడే క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని సాధించగలమని డాక్టర్ రవితేజ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, క్షయ వ్యాధి నిర్మూలన సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆకుల రాజయ్య ఆధ్వర్యంలో సన్మానం

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** మహాదేవపూర్ మండల కాంగ్రేస్ పార్టీ అధ్యోఉనిగా ఎన్నికైన సీనియర్ నాయకుడు కట్కం అశోక్‌ను శుక్రవారం మండలంలోని బెగ్లూర్ గ్రామ సర్పంచ్ కుల రాజయ్య దంపతులు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.అదే క్రమంలో గ్రామస్థుడు తిమ్మరాజు బ్రహ్మం శాలువాతో సత్కరించి సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా కాంగ్రేస్ పార్టీకి చేసిన నిసావర్థ సేవకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షునిగా నియమించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లూరి సదానంద చారి,మాజీ జడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్,అధికార ప్రతినిధి బుర్రి శివరాజ్,నాయకులు గ్రామస్థులు పాల్గొనానరు.

## మల్లన్న రాకతో మనోహరాబాద్‌లో సందడి

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుక్రవారం మనోహరాబాద్ మండలానికి వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నాయకులు ఆయనకు భారీ పూలమాల వేసి సన్మానించారు.అనంతరం తీన్మార్ మల్లన్న మనోహరాబాద్ చౌరస్తా వద్ద పార్టీ జెండా గద్దెను ఆవిష్కరించి,జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం పార్టీ తరఫున మరింత బలంగా పనిచేస్తామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి విస్తరించేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. మల్లన్నకు స్వాగతం పలికిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఉత్సాహం వ్యక్తం చేశారు.

## డీసీసీ అధ్యక్షునికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం/కొల్చారం :** కొల్చారం మండలం పొత్తం శెట్టిపల్లి హనుమమ్మ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ బుధవారం డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీసీ నాయకుడిని బ్రోకర్‌గా సంబోదించడం సరికాదని, తన వ్యాఖ్యలకు రమేష్ కుమార్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ రమేష్ కుమార్ గతంలో అనుభవించిన పదవులు, చేసిన పనులపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే సర్వే నంబర్లతో సహా వివారాలను బయటపెడతామని అన్నారు. వ్యక్తిగత విషయాలను రాజకీయాల్లోకి తీసుకురావద్దని హెచ్చరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలుగారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రమేష్ కుమార్‌పై ఆధారాలతో చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ వంటి పదవులు అనుభవించిన రమేష్ కుమార్ రంగంపేట అభివృద్ధిపై ప్రజలకు సూమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## వెనుకబడిన రంగాలకు రుణాలు మంజూరు లో వేగం పెంచాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వెనుకబడిన రంగాలకు రుణాల మంజూరులో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో 202627 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నాటికి జిల్లాలో బ్యాంకింగ్ రంగం పనితీరు, ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాధాన్యతా రంగాల వార్షిక రుణ లక్ష్యం రూ.2,599.49 కోట్లు కాగా, జూన్ త్రైమాసికం నాటికి రూ.451.73 కోట్లు, అంటే 17.38 శాతం సాధించారని స్పష్టంచేశారు. ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.611.03 కోట్ల లక్ష్యానికి గాను రూ.261.51 కోట్లు, 42.80 శాతం రుణాలు అందించారని వివరించారు.అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందేలా బ్యాంకర్లు చొరవ చూపాలని తెలిపారు. డిపాజిట్లు సేకరిస్తూ రుణాల మంజూరులో వెనుకబడిన బ్యాంకులు పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లలో రుణాల మంజూరు పురోగతి లేకపోవడంపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించి, తక్షణ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పలిమేల, మొగుళ్లపల్లి, ఘన్‌పూర్ మండలాల్లో 10 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిరుపయోగంగా ఉన్న ఖాతాలను త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశించారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు) :** మండలంలోని ఉప్పేడు వీరాపురం గ్రామ పంచాయతీ సిబ్బంది బాడిస సమ్మయ్య (కారోబార్) ఆరోగ్య పరిస్థితి బాగా లేనందువలన సర్పంచ్ శ్రీమతి మానస రామకృష్ణ, ఉపసర్పంచ్ గుండెల ప్రశాంత్, వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షలు చిట్యాల సాగర్ కలిసి పరామర్శించడం తో పాటు పదివేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

# హద్నూర్ పిఎస్, జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాల తనిఖీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ హద్నూర పి.ఎస్ జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా హద్నూర పోలీసుల గౌరవ వందనం స్వీకరించి డిఎస్పీ సైదానాయక్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత సిబ్బంది కిట్ ,ఆర్టికల్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాదీనపరుచుకున్న ,కేసులకు సంబందించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు సంబందిత ఆస్తులను కోర్టులో సబ్మిట్ చేసే వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని ,మిస్సింగ్ కేసులు దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆస్తి సంబందిత నేరాలు అదికంగా జరుగుతున్న ప్రాంతాలను( క్రైమ్ ప్లోన్ ఏరియాలు ) బ్లాక్ స్పాటుగా గుర్తించి పగలు రాత్రి బీటట్ విధులలో నిఘా పెంచాలని ఆదేశించారు. సీపిటీఎస్ఎస్ 2.0 పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ టీఎస్కాప్ ,హెచ్ఆర్ఎం ఎస్ ఈ సాక్ష్య టెక్ డాటం ,భరాడ్ దర్పణ్ సీఈఐఆర్ సైబర్ క్రైమ్ పోర్టల్ సీడిఆర్ పోర్టబుల్ పింగర్ ప్రింట్ స్టాప్‌వేర్ అప్లికేషన్లపై అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాదించి నేరాల నియంత్రణ సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్1 నుండి పార్ట్ 5 వరకు ఏలాంటి పెండింగ్ లేకుండా సిసి టీఎన్ఎస్2 2.0 లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన పిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడ వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామ పెద్దలు యువతతో సత్సంబందాలు కలిగి శాంతిభద్రతలకు సంబందించి ముందుస్తు సమాచారాన్నిసేకరించాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు సెస్పెక్ట్ హిస్టరీ పిటర్ల వివరాలు తెలిసి ఉండాలని పగలు ,రాత్రి బీట్‌విధులలో తనిఖీ చేస్తూ ఎప్పటికప్పుడు ఎప్పటికప్పుడు ఆన్లైనో ఆప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ పరిశుభ్రత ,రికార్డు నిర్వహణను పరిశీలించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసీటీ కేసులు పోక్స్ కేసులు అత్యాచార కేసులు డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమై దర్యాప్తు చేపట్టి బాదితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలుతీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో చట్టపరమైన నింబందనలు పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలన్నారు. అదే విధంగా ప్రతి నెల తప్పనిసరిగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు ,అనుమానాస్పద వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. డిఎస్పీ కార్యాలయ పోలీసు స్టేషన్ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీదులలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి రివార్డులను ప్రకటించారు. ఈ వార్షిక తనిఖీల సందర్బంగా జిల్లా ఎస్పీ వెంబడి జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి, సబ్ డివిజన్ ఎస్ఐలు ఉన్నారు.

## మెదక్ అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ఎంపిక

**ప్రజాపక్షం/మెదక్** : 12వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి అండర్14, 16, 20 బాలబాలికల జిల్లా స్థాయి ఎంపికలు మెదక్ స్థానిక అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించారు. త్రోస్, రన్స్ జంప్స్ విభాగాల్లో జరిగిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పోటీలను ప్రారంభించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పతకాలు అందజేసి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మెదక్ జిల్లాకు పతకాలు సాధించేలా క్రీడాకారులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. డీవైఎస్ఓ గంగాల రమేష్, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి క్రీడాకారులకు పతకాలు అందించి అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 26,27 తేదీల్లో వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అరునార్తి వెంకటరమణ, ఏ మధుసూదన్, సుజాత, పీడీ రాజేందర్, మహిపాల్, ప్రకాష్, పూర్ణచందర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌తో రైతుల గోస

**ప్రజాపక్షం/శివ్వంపేట** : మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం యూరియా యాప్‌తో రైతులుఇబ్బందులు ఎదురుకున్నారు. ఓ వైపు యూరియా అందుబాటులో ఉన్నప్పటికి ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ బుకింగ్ నిబంధనలు రైతులకు యూరియా ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకున్న పలువురు రైతులు యాప్‌లో యూరియా బుకింగ్ కాకపోవడంతో ఆందోళన చేశారు. రైతులకు యూరియా బుకింగ్ కాక యాప్‌తో అనేక సమస్యలు ఎదురుకుంటున్నామని, తమకు యాప్‌తో సంబంధం లేకుండా సులభంగా అందించాలని రైతులు కోరారు.



## కాంగ్రెస్ పార్టీ బందారం గ్రామకమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/కొండపాక** : కొండపాక మండలం బందారం కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీని శుక్రవారం కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినట్టు పార్టీ మండల అధ్యక్షుడు మంచాల కనక రాములు తెలిపాడు. పార్టీ అధ్యక్షులుగా బడే కోల్ నరేష్, ఉపాధ్యక్షుడిగా రాగల్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా మహేష్ లనుఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్ట పరశురాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ గజ వెల్లి సుదర్శన్ , వివిధ గ్రామాల సర్పంచులు కొయ్యడ వెంకటేశం, బొమ్మ మల్లయ్య , పావని శశిధర్ రెడ్డి, కొలుపుల గంగాధర్ , కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ వేముల బాబు, యూత్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంజాగౌడ్ మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు

### సి.పి.ఐ సీనియర్ నాయకులు వీర్లప్రకాష్‌రావు



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : పి.అంజాగౌడ్ మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని భారత కమ్యూనిస్టు సీనియర్ నాయకులు వీర్లప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం నాడు సంగారెడ్డి లోని తన కుమారుడు ప్రభుగౌడ్ స్వగృహంలో పి.అంజాగౌడ్ తుది శ్వాస విడిచారు.సంగారెడ్డి భూ పోరాట యోధుడు ,భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకులు అంజాగౌడ్ (96) అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న సీనియర్ నాయకుడు వీర్ల ప్రకాశ్ రావు, సిపిఐ కార్యదర్శి రెహెమాన్, సయ్యద్ ,సంతోష్ కుమార్, ఆయన బౌతికకాయంపై పుష్ప గుచ్చం ఉంచి శ్రద్దాంజలి ఘటించి కుటుంబానికి ప్రగాడ సానుబూతి తెలిపారు. అనంతరం సిపిఐ రాష్ట్ర నాయకులు వి. ప్రకాష్ రావు ఆయనను స్మరిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ కి అంజా గౌడ్ మృతి తీరని లోటని అంజాగౌడ్,నారాయణ రెడ్డి తో కలిసి ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక చోట్ల నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ,సాగు భూమి లేని వారికి సాగు భూమిని పంచారన్నారు. ప్రభుత్వాఅధికారులతో విరోచతమైన పోరాటాలు, చేసి పట్టా సర్టిపికెట్ ఇప్పిచ్చిన ఘనత నారాయణరెడ్డి ,అంజాగౌడ్‌ల దేనని కొనియాడారు. వారిని ప్రజలు ఎప్పుడు మరువరన్నారు. వారు చిరస్మరణీయులన్నారు. ఈ తరం కమ్యూనిస్టులు ,నారాయణరెడ్డి ,అంజాగౌడ్ ను స్పూర్తిగా తీసుకొని పేద ప్రజల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని తెలిపారు.

## భక్తులతో కిటకిట లాడిన సంతోషిమాత ఆలయం



**ప్రజాపక్షం/ సిద్దిపేట** : శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని సంతోషి మాత ఆలయం భక్తులతో కిటకిట లాడింది. వందలాది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక క్యూలైన్‌లో ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తును నిర్వహించారు. సుభాష్‌రోడ్డులో ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్దీకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలాయ కమిటి వారు అందచేశారు.

**ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇం చార్జి పూజల హరికృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా సంతోషి మాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆయన ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, సంతోషి మాత ఆలయ కమిటీ సభ్యులు పూజల హరికృష్ణ గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని పూజల హరికృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంప చంద్ర్ ,చొప్పదండి రాము, చింత సంతోష్ కె. బ్రహ్మం, జిల్లా రజిత, రవికంటి జయప్రద, బండి మమత తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/కొండపాక** : కొండపాక మండలం లోని పలు గ్రామాల్లో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కొండపాకలో గ్రామ సర్పంచ్ మంచాల నవీన ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వెలికట్ట గ్రామంలో సర్పంచ్ బూరుగుల మానస సురేందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. దుద్దెడ గ్రామంలో సర్పంచ్ మిద్దె శివకుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నిరుపేదలైన అర్హులందరికీ కార్డులు అందుతాయని తెలిపారు.

## బాధిత కుటుంబానికి భరోసా

**ప్రజాపక్షం/కొండాపూర్** : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సుజాత కుటుంబం నివాసం ఉంటున్న పెంకుటిల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా కుంగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కొండాపూర్ తహసీల్దార్ అశోక్ ,గ్రామ జిపిఓ ,సర్పంచ్ గడీల శ్రీనివాస్‌గౌడ్ కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. భాదిత కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఇందిరమ్మ, గృహ నిర్మాణ పథకం 2వ దశ కింద ఇంటిని మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అనంతరం భాదిత కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఏడుపాయల మాజీ డైరెక్టర్ బికొండ నారాయణ మృతి

**ప్రజాపక్షం/పాపన్నపేట** : ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయ మాజీ డైరెక్టర్ బి కొండ నారాయణ అనారోగ్యంతో గురువారం రాత్రి హైదరాబాద్ ఆసుపత్రిలో మరణించారు. ఆయన స్వగ్రామమైన పాపన్నపేటలో శుక్రవారం నాడు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతిక కాయానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొన్నారు. మాజీ ఏడుపాయల చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అంత్యక్రియలో మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, రంగంపేట శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు పట్టణాల్లో పెరుగుతున్న గుండె జబ్బులు

**ప్రజాపక్షం/మెదక్** : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ గుండె జబ్బులు రోజు రోజుకు పెరుగుతున్నాయని, ప్రజాల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ శశి కే శ్రీవాస్తవ్ అన్నారు. శుక్రవారం మెదక్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ రోజువారీ ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, అధికంగా ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు తీసుకోవడం, నిల్వ ఆహారం తినడం, శరీరానికి వ్యాయామం లేకపోవడం గుండె జబ్బులకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని తెలిపారు. హైబీపీ, కొలెస్ట్రాల్, షుగర్‌తో పాటు అధిక ఒత్తిడి, నిద్రలేమి కూడా గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పండ్లు, కూరగాయలు, చేపలు, చికెన్ ను మితంగా ఆహారంలో చేర్చుకోవాలని, మాంసాహారం అధికంగా తీసుకోవడం, స్మోకింగ్ వంటి అలవాట్లను సాధ్యమైనంత వరకు తగ్గించాలని సూచించారు. ప్రతిరోజూ తగినంత వ్యాయామం, 30 నిముషాలు నడక తప్పనిసరి చేయడంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని కోరారు. గుండె జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం గుండె జబ్బులకు అత్యాధునిక వైద్య సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని, వివిధ రకాల గుండె సమస్యలకు ఆధునిక పద్దతుల్లో వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజలు భయపడకుండా ముందుస్తు పరీక్షలు, జాగ్రత్తలు పాటిస్తూ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

## కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాపన్నపేట** : కడుపు నొప్పితో బాధపడుతూ ఉరి వేసుకుని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో జరిగింది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన వగ్గు రశిత (14) మండలంలోని యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో ఎనిమిదివ తరగతి చదువుతుంది. తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది.పలుమార్లు హాస్పిటల్‌లలో వైద్యం చేసిన కడుపు నొప్పి తగ్గడం లేదు. శుక్రవారం ఉదయం సమయంలో కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లో దిగులుగా ఉంది. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొంత సమయం తరువాత గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.